క్లుప్తంగా

వేడుకగా ఏకాంత సేవ

సోమశిల: మండలంలోని కచిరిదేవరాయపల్లిలో కొలువైన రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి ఏకాంత సేవ ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు పరాంకుశం భానుప్రకాషాచార్యులు దేవదేవేరులను ఘనంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామానికి చెందిన మాదుగుల గంగాధరం, అమ్మణ్ణమ్మ కుటుంబ సభ్యులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

ఎన్నికల ఏర్పాట్లు జేసీ పరిశీలన

ఆత్మకూరు: తూర్పురాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ పరిస్థితులను జేసీ రోణంకి కూర్మనాథ్ పరిశీలించారు. ఆత్మకూరు డివిజన్‌కు సంబంధించి ఎన్నికల సామగ్రి డిస్ట్రిబ్యూషన్, పోలింగ్ అనంతరం బ్యాలెట్ బ్యాక్సులను రిసీవ్ చేసుకునేందుకు పాలిటెక్నిక్ కళాశాలలో చేసిన ఏర్పాట్లను జేసీ శనివారం పరిశీలించారు. ఆదివారం ఉదయం పోలింగ్ సిబ్బందికి ఎన్నికల సామగ్రి అందజేయనున్నారు. అక్కడి నుంచి వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు చేరేలా ఏర్పాట్లు చేశారు. సోమవారం సాయంత్రం 4 గంటలకు పోలింగ్ అనంతరం బ్యాలెట్ బ్యాక్స్‌లను పాలిటెక్నిక్ కళాశాలకు చేర్చుతారు. అక్కడి నుంచి చిత్తూరు జిల్లా కలెక్టరేట్‌కు ఇద్దరు తహసీల్దార్లు, పోలీసు, రెవెన్యూ సిబ్బందితో కూడిన పటిష్టమైన బందోబస్తుతో చేర్చనున్నట్లు తెలిపారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ



విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేస్తున్న దృశ్యం

చేజర్ల: మండలంలో 10వ తరగతి చదువుతున్న 320 మంది విద్యార్థులకు శనివారం రెడ్డివారికండ్రికకు చెందిన పలసాని సురేష్ పరీక్ష సామగ్రిని అందజేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆదూరుపల్లి, చేజర్ల, నాగులవెలటూరు, తూర్పుకంభంపాడు, తూర్పుపల్లి, మాముడూరు, అదూరుపల్లిలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులకు పరీక్షకు అవసరమైన అట్ట, స్కేల్, 2 పెన్నులు, పెన్సిల్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ బి శైలజాకుమారి, వైస్ ప్రిన్సిపల్ నాగలలిత, సీఆర్పీలు మల్లికార్జున్‌రావు, డేటా ఎంట్రీ ఆపరేటర్ చీర్ల ప్రసాద్ పాల్గొన్నారు.

ఇంటి ముంగిటకే వైద్యసేవలు

వరికుంటపాడు: రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ వైద్యసేవలను ప్రజల ఇంటి ముంగిటే అందిస్తున్నామని స్థానిక పీహెచ్‌సీ ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్యాధికారిణి ఆయేషా అన్నారు. ఆమె శనివారం మండలంలోని గణేశ్వరపురం, తూర్పురొంపిదొడ్ల గ్రామాల్లో 104 వాహనం ద్వారా ఫ్యామిలీ డాక్టర్ వైద్యసేవలను అందించారు. ఈ సందర్భంగా 40 మంది రోగులను పరీక్షించి మందులు అందజేశారు. మంచాలకే పరిమితమైన వివిధ రోగుల ఇళ్లకు వెళ్లి పరీక్షించి తగు వైద్య సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సహాయకుడు రవి, ఏఎన్‌ఎంలు కామాక్షి, ఫరిదా సిబ్బంది పాల్గొన్నారు.

పాడి రైతులు సహకరించాలి

వరికుంటపాడు: నాలుగు నెలలు నిండిన పాడి పశువులకు ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నారని, పాడి రైతులు సిబ్బందికి సహకరించాలని మండల ఇన్‌చార్జి పశువైద్యాధికారి ఎస్‌వీఎస్ రాఘవేంద్రశర్మ అన్నారు. ఆయన శనివారం మండలంలోని విరువూరు, నార్తు కొండాయపాళెం, వేంపాడు, తూర్పుబోయమడుగుల గ్రామాల్లో జరుగుతున్న టీకాల కార్యక్రమాన్ని పరిశీలించి సిబ్బందికి సూచనలు అందించారు. అనంతరం మాట్లాడుతూ మండలంలో 19,600 పశువులకు టీకాలు వేయాలని లక్ష్యం కాగా ఇప్పటి వరకు ఐదు వేల పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశామన్నారు. లక్ష్య సాధనకు పాడి రైతులు సహకరించాలన్నారు.

ఆర్‌ఎస్సార్‌లో క్యాంపస్ ఎంపికలు

బిట్రగుంట: బోగోలు మండలం కడనూతలలోని రామిరెడ్డి సుబ్బరామిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో బెంగళూరుకు చెందిన ట్యాప్ అకాడమీ సంస్థ శనివారం క్యాంపస్ ఎంపికలు నిర్వహించింది. క్యాంపస్ ఎంపికల్లో మొత్తం 135 మంది విద్యార్థులు పాల్గొనగా రాత పరీక్షలు, సాఫ్ట్‌వేర్ కోడింగ్, మౌఖిక పరీక్షల అనంతరం 14 మందిని ఎంపిక చేసినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పీ వీరనారాయణరెడ్డి తెలిపారు. ఎంపికైన విద్యార్థుల్లో ఆర్‌ఎస్సార్ విద్యార్థులు తొమ్మిది మంది కాగా డీబీఎస్ కళాశాల విద్యార్థులు ఐదుగురు ఎంపికై నట్లు తెలిపారు. ఎంపికై న విద్యార్థులకు శిక్షణ అనంతరం ఏడాదికి రూ.3.5 లక్షల వేతనం చెల్లించనున్నట్లు వివరించారు. క్యాంపస్ ఎంపిక ప్రక్రియలో సంస్థ ప్రతినిధులతో పాటు కళాశాల పరిపాలనాధికారి ఆర్‌వీ రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను ఆశీర్వదించండి

• ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం సమాప్తం


ఆత్మకూరులో దుకాణాల వద్ద ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న పార్టీ నాయకులు

ఆత్మకూరు: తూర్పురాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుతో పోటీచేస్తున్న అభ్యర్థులు పేర్నాటి శ్యామ్ ప్రసాద్‌రెడ్డి, పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిలను ఆశీర్వదించి భారీ మెజార్టీతో గెలిపించాలని పార్టీ నాయకులు ముమ్మర ప్రచారం నిర్వహించారు. శనివారం పట్టణంలోని ఎంజీఆర్ కార్యాలయంలో సమావేశమైన పట్టణ పార్టీ నాయకులు ఎన్నికల వ్యూహంపై చర్చించి అనంతరం ఆర్టీసీ బస్టాండ్ వద్ద నుంచి మున్సిపల్ బస్టాండ్ వరకు ముమ్మర ప్రచారం చేశారు. పలు దుకాణాల వద్ద పట్టభద్రుల ఓటర్లను కలిసి మొదటి ప్రాధాన్యత ఓటు పార్టీ మద్దతు అభ్యర్థులకు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, సీనియర్ నాయకులు డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ జి వెంకటరమణమ్మ, వైస్ చైర్మన్లు డాక్టర్ కేవీ శ్రావణ్‌కుమార్, షేక్ సర్దార్, సొసైటీ అధ్యక్షుడు ఎస్.ప్రతాప్‌రెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొండా వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు మహబూబ్‌బాషా, పెంచలయ్య ఎం.రాజశేఖర్, కొసల్యమ్మ, జి సంధ్య తదితరులు పాల్గొన్నారు.

పేర్నాటి, పర్వతరెడ్డికి మొదటి ప్రాధాన్యతా ఓటు వేయండి

జలదంకి: పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులు పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మొదటి ప్రాధాన్యతా ఓటు వేయాలని వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం జిల్లా అధ్యక్షుడు పాలవల్లి మాలకొండారెడ్డి అభ్యర్థించారు. ప్రచారానికి చివరి రోజు శనివారం మండలంలోని అన్నవరం, దాసరి అగ్రహారం గ్రామాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అన్నవరం సర్పంచ్ గుమ్మడి రమేష్, మాజీ సర్పంచ్ దామెర్ల దేవదాస్, ఫిషర్‌మెన్ అధ్యక్షుడు హజరత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ మద్దతు ఎమ్మెల్సీలను గెలిపిద్దాం

కొండాపురం: వైఎస్సార్ సీపీ మద్దతుతో పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్ ప్రసాద్‌రెడ్డి మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ చిమ్మిలి రాజేంద్రప్రసాద్, వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా సభ్యులు ప్రచారం నిర్వహించారు. శనివారం కొండాపురంలో బీసీ, ఎస్సీ కాలనీలో పట్టభద్రులను కలిసి పేర్నాటిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సోషల్ మీడియా కో కన్వీనర్ బసిరెడ్డి గంగిరెడ్డి, మండల కన్వీనర్ అరుణ్‌కుమార్, కో-కన్వీనర్ మహేంద్ర, స్థానిక నాయకులు రామూర్తినాయుడు, నర్రా శ్రీనివాసులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హోరెత్తించిన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

సంగం: మండలంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం శనివారం హోరెత్తించారు. సంగం పట్టణంతో పాటు అన్ని గ్రామీణ ప్రాంతాల్లో వైఎస్సార్‌సీపీ నేతలు, జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సచివాలయ కో- ఆర్డినేటర్లు, కన్వీనర్లు అందరూ కలిసి ఓటర్ల ఇళ్లకు వెళ్లి ఓట్లు వేయాలంటూ అభ్యర్థించారు. పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు కంటాబత్తిన రఘునాథ్‌రెడ్డి, మండల జేసీఎస్ కో-ఆర్డినేటర్ ముడి మల్లికార్జున్‌రెడ్డి, మండల కన్వీనర్ పులగం శంకర్‌రెడ్డితో పాటు అన్ని గ్రామ పంచాయతీల్లోని వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు.

అభ్యర్థుల గెలుపునకు వంటేరు ప్రచారం

కలిగిరి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యాం ప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయ అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిలకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యుడు వంటేరు వేణుగోపాల్‌రెడ్డి ప్రచారం నిర్వహించారు. శనివారం మండలంలోని అనంతపురంలో ఓటర్లను కలిసి విన్నవించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు మెట్టుకూరు భాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చివరి రోజు ముమ్మరంగా ప్రచారం

సోమశిల: వైఎస్సార్‌సీపీ మద్దతు ఎమ్మెల్సీ అభ్యర్థుల గెలుపు కోసం అనంతసాగరం మండలంలో శనివారం చివరి రోజు ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. పట్టభద్రుల అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయుల అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిలకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని జెడ్పీటీసీ సభ్యుడు రాపూరు వెంకటసుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ నేత ఊరిబిండి ప్రభాకర్‌రెడ్డి కోరారు. ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ, వైస్ ఎంపీపీ అల్లంపాటి సుధాకర్‌రెడ్డి, జేసీఎస్ కో ఆర్డినేటర్ అక్కలరెడ్డి అంకిరెడ్డి, నాయకులు బొర్రా శోభ, రాజగోపాల్‌రెడ్డి, షేక్ మౌలా, నాగార్జునరెడ్డి, పార్లపల్లి రవికుమార్‌రెడ్డి తదితరులు

పేర్నాటిని భారీ మెజార్టీతో గెలిపించాలి

అల్లూరు: పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్ ప్రసాద్‌రెడ్డికి మద్దతుగా అల్లూరు మండలంలో చివరి రోజు శనివారం వైఎస్సార్‌సీపీ నాయకులు ముమ్మరంగా పట్టభద్రులను కలిసి కరపత్రాలను పంపిణీ చేస్తూ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు దండా కృష్ణారెడ్డి, నీలం సాయికుమార్, ఊటు శ్రీకాంత్‌రెడ్డి, మేడా నిరంజన్‌రెడ్డి, ఎం. శ్రీనివాసులరెడ్డి, ఎం. పాండురంగా రెడ్డి, చెంతాటి శ్రీనివాసులు, దాసరి పోలయ్య, మునిరాజ్, పి వీరయ్య, ఎస్.భాస్కర్, డి.శ్యామ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేర్నాటికి ఓటేయండి

వింజమూరు: వైఎస్సార్‌సీపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి శనివారం మండలంలో ప్రచారం నిర్వహించారు. మండలంలోని బుక్కాపురం సచివాలయ పరిధిలోని గ్రామాల్లో ప్రచారం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గణపం బాలకృష్ణారెడ్డి, మాజీ మండల కన్వీనర్ మలిరెడ్డి విజయకుమార్‌రెడ్డి, ఎన్.చినపెంచలరెడ్డి, ఎం.తిరుపాల్‌రెడ్డి, రాజారెడ్డి, పుట్టం రమణారెడ్డి, ఎంపీటీసీ కాటం ప్రసన్న, తదితరులున్నారు.

విస్తృత ప్రచారం

వింజమూరు పాతూరులో వైఎస్సార్‌సీపీ నాయకులు శనివారం విస్తృత ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి పట్టభద్రులను గుర్తించి వైఎస్సార్‌సీపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డికి మొదటి ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనరు రేవునూరు శ్రీనివాసులురెడ్డి, సొసైటీ అధ్యక్షుడు జూపల్లి రాజారావు, సూరం వినోద్‌కుమార్‌రెడ్డి, రాయుడు, అన్నపురెడ్డి శ్రీనివాసులురెడ్డి, తదితరులున్నారు.


సంగం: ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


కలిగిరి: అనంతపురంలో ప్రచారం నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి


సోమశిల: అనంతసాగరంలో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు సిద్ధం

• డివిజన్‌లోని అధికారులతో ఆర్డీఓ సమీక్ష


అధికారులతో సమీక్షిస్తున్న ఆర్డీఓ కరుణకుమారి

ఆత్మకూరు: తూర్పురాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలను ఎన్నికల కమిషన్ ప్రతిష్టాత్మకంగా తీసుకుందని, పకడ్బందీగా నిర్వహించేందుకు కలెక్టర్, ఎస్పీల నేతృత్వంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు ఆత్మకూరు ఆర్డీఓ సాధు కరుణకుమారి అన్నారు. తన కార్యాలయంలో డివిజన్ పరిధిలోని 9 మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు, సిబ్బందితో శనివారం ఎన్నికలపై సమీక్షించారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లపై అధికారులను చర్చించారు. విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు తదితర సౌకర్యాలను అడిగి నిర్ధారించుకున్నారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని ఆత్మకూరు మున్సిపాలిటీ, 9 మండలాల్లో మొత్తం 24 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయుల ఎమ్మెల్సీకి 9 పోలింగ్ కేంద్రాలు, పట్టభద్రుల ఎమ్మెల్సీకి 15 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 4 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. డివిజన్ పరిధిలోని చేజర్లలో 2, ఏఎస్‌పేటలో 2 మొత్తం 4 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా గుర్తించినట్లు అక్కడ ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఎన్నికల సిబ్బంది, అధికారులు సామగ్రిని తీసుకునేందుకు, పోలింగ్ అనంతరం తిరిగి బ్యాలెట్ బాక్స్‌లను చేర్చేందుకు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాట్లు చేసినట్లు ఆమె వివరించారు. సోమవారం ఎన్నిక జరగనున్న క్రమంలో ఎన్నికల సిబ్బంది ఆదివారం 11 గంటల నుంచి తమకు కేటాయించిన మండలాలకు ఎన్నికల సామగ్రితో వెళ్లేలా పకడ్బందీ ఏర్పాట్లు చేశామన్నారు. పోలింగ్ 13వ తేదీ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ కార్యాలయ ఏఓ మధుసూదన్‌రావు, డీఎస్పీ ఎస్.కోటారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ


పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దారు, ఎస్సై


పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీఐ గిరిబాబు

మర్రిపాడు: మర్రిపాడులో సోమవారం జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని తహసీల్దారు హేమంత్‌కుమార్, ఎస్సై విశ్వనాథ్‌రెడ్డి శనివారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందజేశారు. జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. వారి వెంట ఆర్‌ఐ సురేంద్ర, ఏఎస్సై శ్రీనివాసులరెడ్డి, వీఆర్‌ఓలు రాజశేఖర్‌రెడ్డి, హజరత్తయ్య తదితరులు ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్ల పరిశీలన

కొండాపురం: పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణలో భాగంగా స్థానిక జెడ్పీ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన రెండు పోలింగ్ కేంద్రాల్లో వసతులను తహసీల్దార్ ఆర్.బ్రహ్మయ్య శనివారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో 888 మంది పట్టభద్రులు, 27 మంది ఉపాధ్యాయుల ఓట్లు ఉన్నాయన్నారు. వీరు అందరూ ఓట్లను సజావుగా వేసేందుకు పోలింగ్ కేంద్రాలలో కావాల్సిన సదుపాయాలు చేశామన్నారు. ఆయన వెంట వీఆర్వోలు ఏవీవీ ప్రసాద్, పోలయ్య, పంచాయతీ కార్యదర్శులు ప్రవీణ్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఏర్పాట్లు పరిశీలన

సీతారామపురం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఉదయగిరి సీఐ గిరిబాబు స్థానిక రెవెన్యూ సిబ్బందితో కలిసి శనివారం పరిశీలించారు. కేంద్రాల్లో వసతులు, తాగునీరు తదితర వసతులను పరిశీలించారు. వీరి వెంట సీతారామపురం, ఉదయగిరి ఎస్సైలు కిషోర్‌బాబు, ప్రభాకర్ ఉన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లు పూర్తి

వరికుంటపాడు: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహసీల్దార్ అబ్దుల్‌హమీద్ అన్నారు. ఆయన శనివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాట్లు పరిశీలించి సిబ్బందికి తగు సూచనలందించారు. అనంతరం మాట్లాడుతూ పోలింగ్ కేంద్రంలో పట్టభద్రులు, ఉపాధ్యాయులకు విడివిడిగా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఆయన వెంట ఎస్సై బాలమహేంద్రనాయక్, వీఆర్వో శేషారెడ్డి పాల్గొన్నారు.

ప్రతిపక్ష పార్టీల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

ఆత్మకూరు: పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులుగా పోటీచేస్తున్న సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి, కుట్టుబోయిన బ్రహ్మానందంకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని బీజేపీ నాయకులు శనివారం ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి, సీనియర్ నాయకులు కుడుముల సుధాకర్‌రెడ్డి, కె.సుధాకర్ ఆధ్వర్యంలో ఓటర్లను కలిసి అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో గడ్డం వెంకటేశ్వరరెడ్డి, నలిశెట్టి శ్రీనివాసులు, ఉమామహేశ్వరరావు, మహేశ్వరరెడ్డి, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ప్రచారం

టీడీపీ మద్దతు ఎమ్మెల్సీ అభ్యర్థులు కంచర్ల శ్రీకాంత్, ఎల్‌సీ రమనారెడ్డిలకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి విజయం అందించాలని ఆ పార్టీ నాయకులు ఆత్మకూరులో ప్రచారం నిర్వహించారు. చంద్రారెడ్డి, విజయభాస్కర్ రెడ్డి, పిడికిటి వెంకటేశ్వర్లు, పులిమి శైలజ, వెంకటయ్య పాల్గొన్నారు.

యూటీఎఫ్ ర్యాలీ

ఆత్మకూరు: పట్టణంలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు శనివారం భారీ ర్యాలీ నిర్వహించారు. పీడీఎఫ్ తరుపున ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న పట్టభద్రుల అభ్యర్థి మీగడ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పొక్కిరెడ్డి బాబురెడ్డిలను గెలిపించాలని కోరారు. శివకుమార్, ఎస్‌కే సందానీ, ఎల్ కృష్ణప్రసాద్, నాగేంద్ర, ఎ.నాగయ్య, అంగన్‌వాడీల యూనియన్ నాయకురాలు రాధమ్మ, కిరణ్, హజరత్తయ్య, శివప్రసాద్ పాల్గొన్నారు.

మహిళలకు సముచిత స్థానం ఇవ్వాలి

• సీనియర్ సివిల్ జడ్జి బి.రాజేష్


మాట్లాడుతున్న జడ్జి బి రాజేష్

ఆత్మకూరు: భారత రాజ్యాంగం మహిళలకు ప్రత్యేక చట్టాలను ఏర్పరిచిందని, వారిని గౌరవించేలా సముచిత స్థానం కల్పించేలా అందరూ సహకరించాలని ఆత్మకూరు కోర్టు సీనియర్ సివిల్ జడ్జి బి.రాజేష్ అన్నారు. అంతర్జాతీయ మహిళా వారోత్సవాలను పురస్కరించుకుని శనివారం పట్టణంలోని ప్రభుత్వ బీసీ బాలికల వసతిగృహం, ఎస్సీ బాలికల వసతిగృహాల్లో మహిళా హక్కులు, వాటిని కాపాడుకునే విధానాలపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, వారిని మరింత ప్రోత్సహించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. కుటుంబాలను చక్కగా తీర్చిదిద్దగలిగే మహిళలు రాజకీయాల్లోనూ రాణించి చక్కని సమాజాన్ని నిర్మించగలిగే సమర్థత కలిగి ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది ఎల్‌వీ రమణయ్య, డాక్టర్ ఎస్‌కే అస్మా, సోషల్ వర్కర్ పెంచల నరసయ్య, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఫీవర్ సర్వే

చేజర్ల: మండలంలోని పెరుమాళ్లపాడు, పుట్టుపల్లి గ్రామాల్లో శనివారం సచివాలయ కార్యదర్శి సందీప్, ఏఎన్‌ఎం రత్నకుమారి ఫీవర్ సర్వే చేశారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని వీధుల్లో బ్లీచింగ్ చల్లారు. అనంతరం జ్వరాలపై అవగాహన కల్పించారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు.

ఉత్తమ ఫలితాల సాధనకు సహకరించండి


మాట్లాడుతున్న హెచ్‌ఎం సయ్యద్ అబ్దుల్‌హమీద్

అనుమసముద్రంపేట: 10వ తరగతిలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు కూడా సహకారం అందించాలని ఏఎస్‌పేట జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం సయ్యద్ అబ్దుల్ హమీద్ కోరారు. శనివారం పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అదనంగా రాత్రులు కూడా ఉపాధ్యాయులు అందుబాటులో ఉండి పిల్లలను చదివించడంపై తల్లిదండ్రులు సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల కమిటీ చైర్మన్ లక్ష్మీప్రసన్న ఉపాధ్యాయులు చేస్తున్న గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ హరికృష్ణ, పీడీ సురేష్, ఉపాధ్యాయులు దొరబాబు, మొహమ్మద్, విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు పోలింగ్ సామగ్రి సిద్ధం

• కావలి ఆర్డీఓ వీకే శీనానాయక్


బ్యాలెట్ బాక్స్‌లను పరిశీలిస్తున్న ఆర్డీఓ శీనానాయక్, తహసీల్దార్ మాధవరెడ్డి

కావలి: సోమవారం పోలింగ్ జరగనున్న తూర్పు రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు పోలింగ్ సామగ్రి సిద్ధం చేసినట్లు కావలి ఆర్డీఓ వీకే శీనానాయక్ వెల్లడించారు. శనివారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు సంబంధించిన బ్యాలెట్ బాక్స్‌లు, బ్యాలెట్ పేపర్లను పరిశీలించి వాటిని గమ్యస్థానాలకు చేర్చే ప్రక్రియను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ కావలి డివిజన్ పరిధిలోని పది మండలాల్లో ఉపాధ్యాయ ఓటర్లకు 10 పోలింగ్ బూత్‌లు, పట్టభద్రులకు 26 పోలింగ్ బూత్‌లను సిద్ధం చేసినట్లు తెలిపారు. ఎన్నికల సామగ్రి తరలించడానికి, సిబ్బందిని చేర్చడానికి ఐదు సెక్టార్లుగా విభజించి ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ఐదుగురు సెక్టార్ ఆఫీసర్లు, ఐదుగురు రూట్ ఆఫీసర్లను నియమించామన్నారు. డివిజన్ పరిధిలో పట్టభద్రులు 21,338 మంది ఓటర్లు కాగా, 1,438 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. పోలింగ్‌కు 152 మంది సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. 200 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆదివారం ఉదయం 8 గంటల నుంచి ఆర్డీఓ కార్యాలయ ప్రాంగణంలో సిబ్బందికి ఎన్నికల సామగ్రిని అందజేసే ప్రక్రియను ప్రారంభించి, మధ్యాహ్నం 12 గంటల్లోగా వారికి కేటాయించిన పోలింగ్ స్టేషన్లకు చేరుకునే విధంగా ఆరు ఆర్టీసీ బస్సులు కూడా సిద్ధం చేసినట్లు చెప్పారు. సిబ్బందికి ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం కూడా పోలింగ్ విధులకు తరలి వెళ్లే సిబ్బందికి సమకూర్చినట్లు చెప్పారు. పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సోమవారం ప్రశాంత వాతావరణంలో జరిగేలా అన్ని ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. ఆర్డీఓ వెంట కావలి తహసీల్దార్ కె.మాధవరెడ్డి ఉన్నారు.

టీడీపీకి ప్రజలంటే గౌరవం, నమ్మకం లేదు

• కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ఆగ్రహం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: టీడీపీ నాయకులు అనునిత్యం జుగుప్సాకరమైన చిల్లర వేషాలతో రాజకీయాలను భ్రష్టు పట్టిస్తున్నారని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి మండిపడ్డారు. కావలిలోని తన నివాసంలో శనివారం విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. టీడీపీ నాయకుల పరిస్థితి చూస్తే స్థానిక నాయకత్వ నుంచి రాష్ట్ర నాయకత్వం వరకు అబద్ధాలతో పబ్బంగడుపుకుంటున్నారన్నారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు ఉపయోగపడే పనులు ఒక్కటీ చేయకుండా అడ్డంగా దోచుకున్నారు కాబటే గత ఎన్నికల్లో ప్రజలు ఆ పార్టీకి కర్రుకాల్చి వాత పెట్టారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిని సమానంగా చేస్తున్నారు కాబట్టే ప్రజలు ఆదరిస్తున్నారన్నారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు ఏమి చేశారో చెప్పలేరని, మరోసారి అధికారమిస్తే ఏమిచేస్తారో చెప్పలేకపోతున్నారని దుయ్యబట్టారు. శవరాజకీయాలు చేయడం, గాలి వెదవలకు మద్యం తాగించి మాట్లాడించే చిల్లర వేషాలు వేయడం అలవాటుగా మారిందన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మేము టీడీపీ నాయకులు ఇళ్లకు కూడా పోతున్నామని, అప్పుడు టీడీపీ నాయకులు ఇళ్లల్లో ఉండకుండా పారిపోతున్నారని చెప్పారు. టీడీపీ నాయకుల కుటుంబ సభ్యులకు కూడా ప్రభుత్వం పథకాలు అందుకుంటున్నారని, వాటిని తాము చదివి వినిపిస్తామనే భయంతో టీడీపీ నాయకులు ముఖం చాటేస్తున్నారని తెలిపారు. పథకాలు వద్దనే దమ్ము ఉందా టీడీపీ నాయకులకు ఎమ్మెల్యే సవాల్ చేశారు. రోడ్లు బాగలేదని ఇప్పుడు గోల చేస్తున్న టీడీపీ నాయకులు, వారు అధికారంలో ఉన్నప్పుడు రోడ్లు ఎందుకు వేయలేదని ప్రశ్నించారు. కొండ బిట్రగుంట స్వామి బ్రహ్మోత్సవాలను కూడా రాజకీయం చేయడం దుర్మార్గమన్నారు. రథోత్సవం సందర్భంగా మానవ తప్పిదం వల్ల జరిగిన పొరపాటును కూడా రాజకీయాలు చేయడం టీడీపీ నాయకుల కుంచిత బుద్ధికి నిదర్శనమన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించండి

ఈ నెల 13న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన ఉపాధ్యా, పట్టభద్రుల స్థానాలకు పోటీ చేస్తున్న పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, పేర్నాటి శ్యాం ప్రసాద్‌రెడ్డి లను గెలిపించాలని ఎమ్మెల్యే అభ్యర్థించారు. ఇటీవల ఉపాధ్యాయ అభ్యర్థి చంద్రశేఖర్‌రెడ్డి తన ఇంటికి వస్తే, ఉపాధ్యాయులు ఉద్యోగ సమస్యలు తెలియజేయడానికి ఆయన్ను కలిసేందుకు వచ్చారని ఎమ్మెల్యే అన్నారు. ఇంటికి వచ్చిన వారిని గౌరవిస్తే తాను టీచర్లను బెదిరించారని టీడీపీ నాయకులు మాట్లాడడం సిగ్గు చేటన్నారు.

సుబ్బానాయుడు, బీద దోపిడీ దొంగలు

టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు కావలి టీడీపీ ఇన్‌చార్జిగా ఉన్న మాలేపాటి సుబ్బానాయుడు, ఆ పార్టీ నాయకుడు బీద రవిచంద్ర కలిసి దగదర్తిలో దోపిడీ చేశారని దగదర్తి ఎంపీపీ తాళ్లూరు ప్రసాద్ నాయుడు విమర్శించారు. దగదర్తి మండలంలోని పలు పరిశ్రమల వద్ద ఇద్దరూ కలిసి రూ.100 కోట్లు దోచుకున్నారని వివరించారు. ప్రైవేట్ వ్యక్తుల వద్ద కూడా అక్రమంగా దోచుకున్నారని తెలిపారు.

ఆచారాల ప్రకారమే బ్రహ్మోత్సవాలు

కొండ బిట్రగుంట శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆచారాలకు అనుగుణంగా నిర్వహిస్తే, కావలి టీడీపీ ఇన్‌చార్జి మాలేపాటి సుబ్బానాయుడు నోటికి వచ్చినట్లు మాట్లాడటం అవివేకమని బోగోలు మండల వైఎస్సార్‌సీపీ మాజీ కన్వీనర్ మద్దిబోయిన వీర రఘు యాదవ్ విమర్శించారు. ఎంపీటీసీగా గెలవలేక ఓడిపోయిన సుబ్బానాయుడు నియోజకవర్గ స్థాయి పదవి ఇవ్వడంతో కావలిలో తాను ఏదో చేస్తున్నానని నిత్యం ఎమ్మెల్యే పై విమర్శలు చేస్తే ప్రజలు హర్షించరని హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో వైఎస్సార్‌సీపీ కార్మిక విభాగం మాజీ రాష్ట్ర కార్యదర్శి కుందుర్తి శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ నాయకులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, జంపాని రాఘవులు గౌడ్, కనమర్లపూడి వెంకటనారాయణ, దండా కృష్ణారెడ్డి, సన్నిబోయిన ప్రసాద్ యాదవ్, నీలం సాయికుమార్, కుందుర్తి కామయ్య, షేక్ షాహుల్ హమీద్, పానుగోటి అనురాధ, కనుపర్తి రాజశేఖర్, కొమారి రాజు, మండలి కృష్ణారావు, మాజీ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎంపీఏ నూతన కమిటీ ఏర్పాటు

కలిగిరి: ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్ అసోసియేషన్ (ఏపీఎంపీఏ) నూతన కమిటీని శనివారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆ సంస్థ జిల్లా కన్వీనర్ మన్నేపల్లి సురేష్ మాట్లాడుతూ ఉదయగిరి నియోజకవర్గం అసెంబ్లీ కమిటీ అధ్యక్షుడిగా మనోహర్, ఉపాధ్యక్షుడిగా ప్రవీణ్‌ను ఎంపిక చేయడం జరిగిందన్నారు. జర్నలిస్టులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక జర్నలిస్టులు పాల్గొన్నారు.